సాక్షి మంచిర్యాల

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024

I



రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ వచ్చేనా

మంచిర్యాలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ రావడం లేదు. వచ్చినా సెలవులోనో, మరో చోటకో వెళ్తున్నారు. కింది స్థాయి సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. IIలో▸



ప్రైవేటు పాఠశాల వద్ద ఉద్రిక్తత

దండేపల్లి: కన్నెపల్లిలోని ప్రైవేటు స్కూల్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. హనుమాన్ మాల ధారులూ యూనిఫాంలో రావాలన్న సూచనతో ఆందోళనకు దిగారు. IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వడగాలులు వీస్తాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నస్పూర్‌లో హెలికాప్టర్ చక్కర్లు

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు ఏరియాల్లో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. పలు ఏరియాల్లో భూమికి దగ్గరగా వచ్చింది. ఈ సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటికి వచ్చి ఆసక్తిగా గమనించారు. పలువురు తమ మొబైల్ ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. హెలికాప్టర్ ఎందుకు వచ్చిందని పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఈ విషయమై స్థానిక ఎస్సై రవికుమార్‌ను సంప్రదించగా హెలికాప్టర్ గురించి తమకు ఏమీ తెలియదని, తెలుసుకుంటామని చెప్పారు.

జన్నారంలో భారీ వర్షం



రోడ్డుపై నిలిచిన నీరు

జన్నారం: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పొనకల్‌లోని ప్రధాన రహదారిపై వరద నీరు పారింది. మంగళవారం వార సంత కావడం, సినిమా హాలు రోడ్డులో వరద నీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 15 నిమిషాలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కూరగాయలు బురద నీటిలో తేలాయి. కూరగాయలు, ఎండు మిర్చి అమ్మే రైతులు ఇబ్బందులు పడ్డారు. నీటి మడుగులోనే స్థానికులు కూరగాయలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది.


మత్స్యకారుల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

పాతమంచిర్యాల: మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార సహకార సంఘాలకు ఈ ఏడాది నుంచి నాణ్యమైన చేపపిల్లల కొనుగోలు కోసం మత్స్యకార సొసైటీల ఖాతాల్లో నగదు జమ చేయాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న చేపపిల్లలు సరిగా ఎదగక ఆశించిన దిగుబడి రావడం లేదని, ఈ ఏడాది తీవ్ర కరువుతో ఉన్న మత్స్య పరిశ్రమను ఆదుకోవడానికి చెరువులు, కుంటల లీజును రద్దు చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యశాఖకు రెగ్యులర్ మంత్రిని, కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరారు. మత్స్య కార్మిక సంఘం నాయకులు గుమ్ముల శ్రీనివాస్, జునుగరి నారాయణ, గుమ్ముల ఆశన్న, బోడెంకి మహేష్, పందిరి వెంకటేశ్వర్లు, బోడెంకి కుమార్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు జీవన భృతి ఇవ్వాలి



మాట్లాడుతున్న రవికుమార్

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల ఆటోలకు గిరాకీ లేక ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, నెలకు రూ.12వేలు జీవనభృతి చెల్లించాలని రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు రవికుమార్, అధికార ప్రతినిధి దార మధు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆటో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని, ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆత్మహత్య బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి శ్రీనివాస్, పొట్ట మధుకర్, ఆటోడ్రైవర్లు రాజు, రాజేందర్, రాజగౌడ్, ఎండీ.హఫీ, గోపాల్ రెడ్డి, అంజన్న, షఫీ పాల్గొన్నారు.

నేడే రాములోరి కల్యాణం

- జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబు
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు



బుగ్గ ఆలయంలో పందిరి వేస్తున్న భక్తులు



మంచిర్యాలలోని రాంనగర్‌లో కల్యాణ వేదిక



మంచిర్యాల గౌతమినగర్ కోదండ రామాలయంలో ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: సీతారాముల కల్యాణోత్సవానికి జిల్లాలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాలకు రంగులు వేసి మామిడి తోరణాలతో అలంకరించారు. భక్తులు కల్యాణాన్ని వీక్షించేందుకు చలువ పందిళ్లు వేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. జిల్లాలోని మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ కోదండరామాలయం, చెన్నూర్ మండలం సుద్దాల గ్రామ రామాలయం వేడుకలకు సిద్ధం చేశారు. మంచిర్యాలలో వందేళ్ల నాటి పాత రామాలయం, శివాలయం, స్థానిక విశ్వనాథ స్వామి ఆలయం, గౌతమినగర్ కోదండ రామాలయం, ఏసీసీ, గర్మిళ్ల హనుమాన్ టెంపుల్, హమాలీవాడ అభయాంజనేస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్/చెన్నూర్‌రూరల్: చెన్నూర్ పట్టణంలో పంచముఖ ఆంజనేయ, బడా హనుమాన్, జగన్నాథాలయం, అయ్యప్ప స్వామి దేవాలయాల్లో సీతారాముల కల్యాణానికి ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం 10.30గంటలకు కల్యాణ వేడుకలు ప్రారంభమవుతాయని అర్చకులు సత్యమూర్తి, మహేశ్వర్‌శర్మ, వేణుగోపాల్‌శర్మ, శంకర్ శాస్త్రి తెలిపారు. జగన్నాథాలయంలో సాయంత్రం 6 గంటలకు కల్యాణ వేడుకలు నిర్వహిస్తామని అర్చకులు దామోర మోహనాచార్యులు తెలిపారు.

శోభాయాత్రలు

శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రతాప్ మారుతీ మందిర్ నుంచి సాయంత్రం 6 గంటలకు హనుమాన్ దీక్షపరుల శోభాయాత్ర, బడా హనుమాన్ మందిర్ నుంచి పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సుద్దాల గ్రామంలో..

చెన్నూర్ మండలం సుద్దాల గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. గ్రామానికి వచ్చిన ఒక ముని వాగు ఒడ్డున చింతచెట్టు కింద సీతారాములు, లక్ష్మణుడు, ఆంజేయస్వామి రాతి విగ్రహాలను బయటకు తీశారని, చెన్నూర్‌కు చెందిన భక్తుడు కిష్టయ్య గ్రామస్తుల సహాయంతో 1910లో డంగు సున్నంతో ఆలయాన్ని నిర్మింపజేశారని ప్రచారంలో ఉంది. అప్పుడు ఆయన వెలిగించిన అఖండ దీపం ఇప్పటికీ వెలుగుతూనే ఉంది. ప్రతీయేటా శ్రీరామనవమి పర్వదినాన సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఏడు రోజలపాటు నాగవెల్లి తదితర కార్యక్రమాలు ఉంటాయి. బుధవారం సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు.

బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో..

బెల్లంపల్లిరూరల్: కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ఎదుర్కోలు, దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజ తదితర కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి, సభ్యులు సంతోష్, గోపి తెలిపారు.

పోటాపోటీ ప్రచారం

- లోక్‌సభ ఎన్నికల్లో వేడెక్కిన రాజకీయం
- వేగం పెంచిన పార్టీల అభ్యర్థులు
- పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో దూకుడు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు గురువారం నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచార వేగం పెంచారు. పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి తమ అభ్యర్థిత్వం ప్రకటించినప్పటి నుంచే ఎన్నికల వేడి రాజుకోగా.. పోలింగ్‌కు గడువు సమీపించే కొద్దీ వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఊపుతో ఉండగా.. బీఆర్‌ఎస్ పార్టీ తమ సిట్టింగ్ స్థానాన్ని పదిల పర్చుకునేందుకు ఆరాటపడుతోంది. ఇక బీజేపీ ఈసారి ఎలాగైనా 'పెద్దపల్లి'లో పాగా వేయాలనే పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో ఒకరిపైనొకరు విమర్శలు చేస్తూ ప్రచారంలో తమదైన శైలిలో దూసుకెళ్తున్నారు. పండుగలు, పర్వదినాల్లో ఆయా వర్గాల ఓటర్లను కలుస్తున్నారు. శుభకార్యాలకు హాజరవుతున్నారు. మరికొద్ది రోజుల్లో ప్రచార వేడిని మరింత పెంచే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ఎవరి శైలిలో వారు ప్రచారం ముమ్మరం చేశారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు పూర్తి కావడంతో ఇక క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు కోసం తమ ప్రయత్నాలు చేస్తున్నారు.

చేరికలకు ఆహ్వానాలు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొందరు నాయకులు పార్టీల్లో చేరగా.. తాజాగా మరికొందరు పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఏ పార్టీలో చేరితే మంచిదనే కోణంలో ఆలోచించుకుని ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ నుంచి గడ్డం వివేక్ చేరికతో చెన్నూర్ నియోజకవర్గంలో ఆ పార్టీకి బలం పెరిగింది. అదే సమయంలో బీజేపీ బలమైన నాయకత్వాన్ని కోల్పోయింది. తాజాగా ఎంపీ ఎన్నికల్లో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల పరిధిలోనూ నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కేడర్ చేరికలను ప్రోత్సహిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట్ల వెంకటేశ్ నేత బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి పార్టీ మార్పు ఖాయంగా ఉంది. ఇంతకుముందు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి గోమాసే శ్రీనివాస్ ఆ పార్టీ నుంచి టికెట్ తెచ్చుకుని బరిలో నిలిచారు. ప్రధానంగా 'గులాబీ' పార్టీ నుంచి అసంతృప్తులను, ఆ పార్టీ బలహీన పడడంతో ఆ కేడర్‌ను ఆకర్శిస్తూ.. తమ పార్టీల్లో చేరేలా కాంగ్రెస్, బీజేపీ నుంచి ఆహ్వానాలు అందుతున్నాయి. ఈ క్రమంలో మరో వారం పది రోజుల్లో పెద్ద సంఖ్యలో చేరికలు ఉండనున్నాయి. జిల్లాలో యువత, చేరికల లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నాయి. అభ్యర్థులు సైతం గ్రామాల వారీగా బలం పెంచుకునేందుకు పార్టీల్లో చేర్పించుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో నాయకత్వ లేమి ఉన్న, ఓటు బ్యాంకు ఉన్న బొగ్గు గని కార్మికులు, ప్రధాన కుల సంఘాల నాయకులు, రాజకీయ నాయకుల అనుచరులను చేర్పించుకుంటున్నారు. తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను రావాల్సిందిగా కోరుతున్నారు.

బహిరంగ సభలకు సన్నద్ధం

రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులతో భారీ బహిరంగ సభలకు ప్రణాళికలు వేస్తున్నారు. సింగరేణి కార్మిక ఓట్ల కోసం రామగుండం, శ్రీరాంపూర్ ఏరియాల్లో సభలు నిర్వహించే అవకాశం ఉంది. అధిక ఓట్ల కోసం జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లోనూ సభలు జరగనున్నాయి. ఎక్కడికక్కడ నియోజకవర్గ ఇన్చార్జీలను నియమించుకుని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాబోయే నెల రోజులు మరింత దూకుడుగా అభ్యర్థులు వ్యవహరించనున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



కాజిపల్లి పనిస్థలంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

భీమారం: పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఆర్డీవో కిషన్ కోరారు. మంగళవారం ఆయన మండలంలోని కాజిపల్లిలో ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కొందరు పట్టించుకోవడం లేదని, ఓటు కోల్పోతున్నామని గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని కోరారు. కాగా, ఉపాధి పనులు గ్రామాల్లో ఉధృతంగా సాగుతున్నాయని, ప్రతీ కూలీకి కూలి రేట్లు ప్రభుత్వం పెంచిందని అన్నారు. గతంలో రూ.270 ఉండగా ఇప్పుడు రూ.300 చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాథోడ్, అధికారులు పాల్గొన్నారు.

'మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం'



ఐక్యతను చాటుతున్న వామపక్ష పార్టీల నాయకులు

పాతమంచిర్యాల: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక హక్కుల సాధనకు బలమైన ప్రజాపోరాటాలు నిర్వహించాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ(చంద్రన్న వర్గం), సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో ప్రజల్లో మత కలహాలు సృష్టిస్తూ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. అయోధ్యలో రామమందిరం, శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట పేరుతో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేసి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి(చంద్రన్న వర్గం) మేకల రామన్న, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు నంది రామయ్య, జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, తదితరులు పాల్గొన్నారు.

మటన్ దుకాణాలపై కొరడా



జేసీబీతో మటన్ దుకాణం కూల్చివేత

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిధిలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద మటన్ దుకాణాలపై మున్సిపల్ అధికారులు మంగళవారం కొరడా ఝులిపించారు. మటన్ దుకాణాల్లో అనారోగ్యంగా ఉన్న మేకలు కోస్తున్నారని ఇప్పటికే పలుమార్లు చెప్పిన వినకపోవడంతో దుకాణాలను జేసీబీ వాహనంతో కూల్చివేశారు. ఇష్టారాజ్యంగా మటన్ అమ్మకాలు జరుపుతున్నారని, ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కోసి ఉంచిన మటన్‌ను స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన, అనారోగ్యంగా ఉన్నవాటిని విక్రయిస్తున్నారని దుకాణాలను సీజ్ చేశారు. ఆరోగ్యంగా ఉన్న వాటిని పశువైద్యాధికారులు ధ్రువీకరించిన అనంతరం విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, శానిటరీ ఇన్స్పెక్టర్ అజీమ్, జవాన్ దినేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కల్పన

నెన్నెల: రసాయన ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయించినా, కాలం చెల్లిన మందులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి జి.కల్పన హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. దుకాణాలు, గోదాముల్లో నిల్వలు, స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలను సకాలంలో తెప్పించాలని ఆదేశించారు. ఆధార్ కార్డు తీసుకువచ్చిన రైతులకు ఈ పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. జోగాపూర్ గ్రామంలో వరిపొలాలు, కూరగాయల తోటలు సందర్శించారు. కూరగాయల పంటల్లో రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు ఇమిడాక్లోరోపిడ్ 2.5 మిల్లీమీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్, ఏఈఓలు రాంచందర్, సుప్రజ ఉన్నారు.

'సివిల్స్'లో మనోళ్లు

- సత్తా చాటిన ఆదిలాబాద్ జిల్లా వాసులు
- మెరిసిన విశాల్, సందీప్, శుభం



గమ్యం చేరే దాకా లక్ష్యాన్ని వీడలేదు. అకుంఠిత దీక్షతో చదివి విజయతీరాలకు చేరువయ్యారు. తొలిప్రయత్నంలోనే మెరిసింది ఒకరైతే.. అలుపెరగని పోరాటం మరో ఇద్దరిది. ఇలా ఆ ముగ్గురూ సివిల్స్‌లో సత్తా చాటారు. ఆదిలాబాద్ జిల్లా పేరును జాతీయస్థాయిలో మారుమోగించారు. వారే ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన ఆరె విశాల్, ఇంద్రవెల్లి మండలానికి చెందిన శుభం, జిల్లా కేంద్రానికి చెందిన ఆదా సందీప్.

తొలిప్రయత్నంలోనే సందీప్ సత్తా




కుటుంబ సభ్యులతో సందీప్



సందీప్

ఆదిలాబాద్‌టౌన్: యూపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఆదా సందీప్ సత్తా చాటాడు. తొలి ప్రయత్నంలోనే 830వ ర్యాంకు సాధించాడు. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామానికి చెందిన ఆదా వెంకటేశ్–వాణి దంపతులు ప్రస్తుతం పట్టణంలోని రవీంద్రనగర్‌లో స్థిరపడ్డారు. వారి చిన్న కుమారుడైన సందీప్ ఐదో తరగతి వరకు పట్టణంలోని లిటిల్‌ప్లవర్ స్కూల్‌లో, ఆరు నుంచి పది వరకు కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని నవోదయలో చదివాడు. ఇంటర్ హైదరాబాద్‌లోని గాయత్రీ కళాశాలలో పూర్తి చేశాడు. జేఈఈ మెయిన్స్‌లో 550వ ర్యాంకు సాధించాడు. బీహార్ రాష్ట్రంలోని ధన్‌బాద్ ఐఐటీ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. తర్వాత బెంగుళూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఏడాది పాటు ఉద్యోగం చేశాడు. గతేడాది ఉద్యోగాన్ని వదిలేశాడు. హైదరాబాద్‌లో సివిల్స్‌కోసం ఆన్‌లైన్ శిక్షణ పొందుతున్నాడు. తొలి ప్రయత్నంలోనే ఈ ర్యాంకు సాధించాడు. అయితే ఐఏఎస్ తన లక్ష్యమని, సాధించే వరకు అలుపెరుగకుండా శ్రమిస్తానని సందీప్ పేర్కొన్నాడు. తల్లిదండ్రులు, కుటుంబీకుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించినట్లుగా తెలిపాడు. కాగా, సందీప్ తండ్రి ఇంటిలిజెన్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్ ఖరగ్‌పూర్‌లో ఐఐటీ పూర్తి చేసి ప్రస్తుతం యూఎస్ఏలో ఉద్యోగం చేస్తున్నాడు. సందీప్ మెరుగైన ర్యాంకు సాధించడంపై ఆయన తల్లిదండ్రులు, కుటుంబీకులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడో ప్రయత్నంలో విశాల్ సక్సెస్



తల్లిదండ్రులతో విశాల్

ఆదిలాబాద్‌రూరల్/జైపూర్: మండలంలోని చాందా(టి) గ్రామానికి చెందిన ఆరె వెంకటేశ్వర్లు–వనమాల దంపతుల కుమారుడు విశాల్ యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటాడు. తండ్రి వెంకటేశ్వర్లు ప్రస్తుతం జైపూర్‌లో ఏసీపీగా కొనసాగుతున్నారు. వృత్తి రీత్యా తండ్రి పోలీస్ ఉద్యోగంలో బిజీగా ఉండడంతో పిల్లల చదువు, బాగోగులు తల్లి చూసుకుంది. విశాల్ పదో తరగతి వరకు మెదక్ జిల్లా తుప్రాన్ రెసిడెన్షియల్ పాఠశాలలో, ఇంటర్ నారాయణ కళాశాలలో చదివాడు. ఐఐటీలో 1,600 ర్యాంకు సాధించి ఉత్తరాఖండ్‌లోని రూర్కి ఇంజినీరింగ్ కళాశాలలో 2020లో బీటెక్ పూర్తి చేశాడు. సివిల్స్ లక్ష్యంగా విశాల్ మూడో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 718వ ర్యాంకు సాధించాడు.

ఇంటి వద్దే ఉండి చదివా..

మా గ్రామంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ తప్ప ఇతర అన్ని ఉద్యోగాలు సాధించిన వారున్నారు. వాటిలో ఏదైనా ఒకటి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. గతంలో రెండు సార్లు సివిల్స్ రాసినప్పటికీ రాణించలేకపోయా. ఈసారి గురి తప్పకుండా కృషి చేశా. ఇంటి వద్ద ఉంటూనే ప్రతి రోజు 12 నుంచి 14 గంటలు చదివా. ఇతర నోట్స్‌తో పాటు తరచూ ఆన్‌లైన్ క్లాసులు విన్నా. కష్టపడి చదివితే అనుకున్నది సాధించవచ్చు. - విశాల్

నాలుగోసారి.. 'శుభం'



కుటుంబ సభ్యులతో శుభం

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన రేకుల్‌వార్ శుభం యూపీఎస్సీ ఫలితాల్లో 790 ర్యాంక్ సాధించి ఈ ప్రాంత సత్తా చాటాడు. జర్నలిస్ట్ రేకుల్‌వార్ సత్యనారాయణ–గీత దంపతులకు నిలేశ్, నికిలేశ్, శుభం ముగ్గురు సంతానం. శుభం 1నుంచి ఐదో తరగతి వరకు మండలకేంద్రంలోని ప్రతిభ పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు కాగజ్‌నగర్‌లోని నవోదయలో, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో పూర్తి చేశాడు. గౌహతి ఐఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో నాలుగేళ్లుగా తీవ్రంగా కృషి చేస్తున్నాడు. మూడుసార్లు మంచి ర్యాంకు సాధించలేకపోయినా పట్టువదలకుండా చదివి నాలుగోసారి లక్ష్యాన్ని సాధించాడు. రెండేళ్లుగా ఢిల్లీలోని విజన్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ సారి 790 ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు సంబరాల్లో మునిగారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

నెన్నెల: వాహనాల తనిఖీల్లో భాగంగా మంచిర్యాల ఆర్టీవో సంతోష్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా మండలంలోని ఖర్జీ, జంగాల్‌పేట ఇసుక రీచ్ నుంచి ట్యాక్స్ పేపర్లు లేకుండా బెల్లంపల్లికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాసీం తెలిపారు. దీంతో పాటు బెల్లంపల్లిలో సరైన ధ్రువపత్రాలు లేని లారీ, టాటా ఏస్ వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది రాము ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెత్లాపూర్ సమీపంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. రూ.18,490 నగదు, నాలుగు మోటారు సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చెత్లాపూర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న సిబ్బందితో దాడి చేశారు. కనుకుంట్ల నర్సయ్య, సముద్రాల రమేశ్, గంగారపు రామకృష్ణ, గుంజపడుగు సంపత్, మామిడాల శంకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. లోకిని ప్రశాంత్ పరారీలో ఉన్నాడు. అదుపులోకి తీసుకున్న వారిని మందమర్రి పోలీసులకు అప్పగించామని సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలం గౌరీ కొలాంగుడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావ్ తన ఇంట్లో ఎండు గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మంగళవారం జైనూర్ పోలీసులు సోదాలు చేశారు. మూడుకిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భీంరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ పేర్కొన్నారు.

రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ వచ్చేనా?

- మంచిర్యాలకు డిప్యూటేషన్‌పై మాత్రమే వచ్చివెళ్తున్న అధికారులు
- 'రియల్' వ్యాపారం ఇక్కడ అధికంగా జరుగుతున్నా పట్టింపేది?



మంచిర్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు సబ్ రిజిస్ట్రార్లుగా రెగ్యులర్ అధికారులు రావడం లేదు. వచ్చినా వారు సెలవుపైనో, మరో చోటకో వెళ్లిపోతున్నారు. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిత్యం అధికసంఖ్యలో జరుగుతున్నాయి. రియల్ వ్యాపారం కూడా ఈ ప్రాంతంలో అధికంగా ఉంది. రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం అందించే కార్యాలయాల్లో మంచిర్యాల రెండోస్థానంలోనూ నిలిచిన ఘనత ఉంది. రోజుకు 70 నుంచి 80కి పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌లు అవుతుండగా, నెలకు రూ.4కోట్ల నుంచి రూ.5 కోట్ల ఆదాయం వస్తోంది. ఇలాంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి డిప్యూటేషన్ మీదనో, లేదా కింది స్థాయిలో పనిచేసే వారితోనో విధులు నిర్వర్తిస్తున్నారు.

ఇలా వచ్చి.. అలా వెళ్తున్నారు..

2016లో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మంచిర్యాలను జిల్లాగా మార్చారు. అప్పటికే ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా రాంబాబు పనిచేస్తూ 2019లో ఆయన ఉద్యోగ విరమణ పొందారు. కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌రాజు ఇన్‌చార్జిగా ఏడాదిపాటు పనిచేసి బదిలీపై వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆదిలాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రవికాంత్ వచ్చినా ఏడాది మాత్రమే పనిచేసి వెళ్లిపోయారు. ఆదిలాబాద్‌కు చెందిన సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ మూడు నెలలు ఇన్‌చార్జిగా పనిచేస్తుండగా, రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ అప్పారావు వచ్చారు. ఎనిమిది నెలల కాలంలోనే తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలతో ఆయనను సస్పెండ్ చేశారు. ఆదిలాబాద్‌కు చెందిన మురళీకృష్ణకు మరోసారి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌గా నరేశ్ చేరిన నెలన్నరకే వెళ్లిపోయారు. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌గా రాము 2021 జనవరి 16న విధుల్లో చేరిన రెండు నెలల్లోనే గ్రూప్ పరీక్షలకు ప్రిపేరయ్యేందుకు లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లిపోయారు. ఆదిలాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ ఇమ్రాన్‌ఖాన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా, రెండు నెలల్లోనే ఒత్తిడి తట్టుకోలేక సెలవుపై వెళ్లిపోయారు. మంచిర్యాల కార్యాలయంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అశోక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన 12 రోజుల్లోనే ఆదిలాబాద్‌కు చెందిన సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణను మరోసారి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. మధ్యలో నెలపాటు కరీంనగర్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రాజశేఖర్‌రెడ్డి డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేశారు. గ్రూప్స్ పరీక్షల అనంతరం రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ అయిన రాము వచ్చి కొద్ది రోజుల తర్వాత మరోసారి లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత మురళీకృష్ణ ఇన్‌చార్జిగా కొనసాగారు. గతేడాది డిసెంబర్‌లో లక్సెట్టిపేట సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బాలకిషన్ మంచిర్యాలకు డిప్యూటేషన్‌పై వచ్చి ప్రస్తుతం కొనసాగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుతో రియల్ వ్యాపారం అంతంత మాత్రంగానే సాగుతోంది. ఏప్రిల్ 15వ తేదీ నాటికి 484 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, రూ.2.03 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రతీరోజు 70కి పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉండగా, ప్రస్తుతం 40 మాత్రమే అవుతున్నాయి. రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరగకుండా ఉండేందుకు, ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు మంచిర్యాలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాలనే డిమాండ్ వస్తోంది.

ఒత్తిడి కారణంగానే..

రిజిస్ట్రేషన్ చేయని సబ్ రిజిస్ట్రార్లపై తీవ్ర ఒత్తిడి తెస్తుండడంతో ఇక్కడికి వచ్చిన రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు రెండు, మూడు నెలల్లోనే ఏదో సాకుతో వెళ్లిపోతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి వచ్చే ఒత్తిడికి తలొగ్గని, మాట వినని సబ్ రిజిస్ట్రార్లను ఇక్కడి నుంచి ఎలాగైనా పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో అప్పారావు అనే సబ్ రిజిస్ట్రార్ ఎనిమిది నెలల్లోనే సస్పెండ్ అయ్యారు. దీంతో కిందిస్థాయి సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు సబ్ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నా, వీరికి సబ్ రిజిస్ట్రార్‌గా అనుభవం లేకపోవడంతో తక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తగ్గిపోతోంది.

రిజిస్ట్రేషన్లు, ఆదాయం ఇలా..

2022–23 ఆర్థిక సంవత్సరంలో 20,038 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా, రూ.57.08 కోట్ల ఆదా యం వచ్చింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 20,173 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా, రూ. 53.01 కోట్ల ఆదాయం సమకూరింది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పెరిగినా రూ.4కోట్ల మేర ఆదాయం గతేడాది తక్కువగా వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌తో పాటు, రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో, రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. భూముల క్రయవిక్రయాలు ఎక్కువ మొత్తంలో జరిగి నెలకు రూ.5కోట్ల ఆదాయాన్ని అందించే రిజిస్ట్రేషన్లు, స్టాంపులశాఖగా మంచిర్యాల కార్యాలయం పేరు గాంచింది. అయితే ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరగడం, రియల్ వ్యాపారం జోరుగా సాగడంతో ఈ ప్రాంతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగిన ఘటనలూ ఉన్నాయి.

ఐటీఐ ఎన్టీసీ పొందటానికి అవకాశం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేస్తూ అర్హత కలిగిన ప్రైవేట్ అభ్యర్థిగా ఐటీఐ నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ (ఎన్‌టీసీ) పొందటానికి అవకాశం కల్పిస్తున్నట్లు మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐకి సంబంధించిన ఏదేని ట్రేడ్‌లో అనుభవమున్న అభ్యర్థులకు సంబంధిత ట్రేడ్ పరీక్షలకు (ఆలిండియా ట్రేడ్ టెస్ట్ (ఏఐటీటీ)కు హాజరయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ఐటీఐలో ఏదైనా ట్రేడ్‌కు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలో ఎస్సెస్సీ ఉత్తీర్ణులై, మూడేళ్లు ఆయా ట్రేడ్‌లలో అనుభవం కలిగి ఈపీఎఫ్, ఈఎస్ఐ కలిగినవారికి ఎన్టీసీ పొందటానికి వీలుందని వివరించారు. నాలుగు కేటగిరీలకు సంబంధించిన అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోపు ములుగురోడ్‌లో గల కార్యాలయంలో వరంగల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌ను నేరుగా కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీహెచ్‌సీ సందర్శన

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు మంగళవారం పరిశీలించారు. ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశాల సమావేశం ఏర్పాటు చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ తగలకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైద్యులు శిల్ప, కృష్ణతేజ, పీవో ప్రతాప్, హెచ్ఈవో జగదీశ్ పాల్గొన్నారు.

నగదు స్వాధీనం

కాగజ్‌నగర్ రూరల్: వంజీరి చెక్‌పోస్టు వద్ద మంగళవారం తనిఖీలు చేపట్టి ఇద్దరి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు తెలిపారు. మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్‌కు వస్తున్న ఆదె సంతోష్ నుంచి రూ.56,500, రయీస్ అహ్మద్ నుంచి రూ.81,850 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి రైతు దుర్మరణం


పొలంవద్ద పంచనామా చేస్తున్న ఎస్సై రాములు

భీమారం: మండలంలోని పోలంపల్లి శివారులో రైతు అనపర్తి తిరుపతి (47) మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై బీ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగూడెం గ్రామానికి చెందిన తిరుపతి పోలంపలి శివారులోని పంట పొలానికి వెళ్లాడు. అక్కడ పనులు చేస్తున్న సమయంలో కాలుజారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాడు. విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై రాములు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చెన్నూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిరుపతి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అనపర్తి తిరుపతి (ఫైల్)

మెట్ల పైనుంచి పడి వృద్ధుడి మృతి


లింగయ్య మృతదేహం

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కంపెల లింగయ్య(64) సోమవారం రాత్రి తన ఇంటి మెట్లపై నుంచి జారిపడి మృతిచెందాడు. ఎస్సై కే.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగయ్య అధికంగా మద్యం తాగి ఇంట్లోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా కాలు జారి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబు లెన్స్‌లో ఎక్కించేందుకు ప్రయత్నించగా అ ప్పటికే చనిపోయినట్లు సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించా రు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి శవమయ్యాడు


శంకర్ (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. వివరాలు.. జిల్లా కేంద్రంలోని బెస్తవాడకు చెందిన నాగోషే శంకర్ (26) రోజులాగే ఇంటి పక్కనున్న ధస్‌రాథ్‌తో కలిసి మంగళవారం ఉదయం 9గంటలకు చేపల వేటకు వెళ్లాడు. గుడిగూడ సమీప వాగులో ఇద్దరూ చేపలు పట్టారు. వాగులో నీటిసొరంగం గమనించని శంకర్ చేపలు పడుతూ ప్రమాదవశాత్తు అందులో గల్లంతయ్యాడు. ధస్‌రాథ్ ఎంత గాలించినా శంకర్ ఆచూకీ దొరకలేద. దీంతో ఇంటికి ఫోన్ చేసి కుటుంబీలకు సమాచారం ఇచ్చాడు. పలువురు శంకర్ గల్లంతైన ప్రదేశంలో గాలించారు. సొరంగంలో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య సురేఖ, కూతురు ఉన్నారు.

ఉద్యోగమేళాకు స్పందన


మేళా నిర్వాహకులతో ఎంపికైన అభ్యర్థులు

మంచిర్యాలఅర్బన్: మిమ్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. జియో, ముత్తూట్ ఫైనాన్స్, టీవీఎస్ కంపెనీలు జాబ్‌మేళా నిర్వహించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి డిగ్రీ పూర్తిచేసుకున్న 250 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉద్యోగాలకు 96 మంది ఎంపికయ్యారు. టాస్క్ రీజినల్ మేనేజర్ దీపాభారాజు, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రాజు, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ శ్వేత, టాస్క్ కో ఆర్డినేటర్ రోహిత్‌కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌పై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం కలెక్టర్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. యూనిఫాం కుట్టుకూలీకి సంబంధించిన డబ్బులు ప్రిన్సిపాల్ విద్యార్థులకు ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం ప్రిన్సిపాల్‌తో మాట్లాడదామంటే ఆమె పాఠశాలకు సరిగా రాకుండా లీవ్‌లో ఉంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ అనీలాను ఫోన్‌లో సంప్రదించగా, కూలీ చార్జి డబ్బులు 2022–23 సంవత్సరానికి సంబంధించినవి తెలిపారు. ప్రస్తుతం ఎస్సెమ్మీస్ కమిటీ రద్దయిందని, కొత్త కమిటీ వేసిన తర్వాత వారితో మాట్లాడి బిల్లులు పిల్లలకు ఇవ్వడమా, పాఠశాల కోసం ఖర్చు చేయడమా అనేది నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాల వద్ద ఉద్రిక్తత

- దీక్ష తీసుకున్నా యూనిఫాం వేసుకోవాలన్న ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం
- హనుమాన్ దీక్షాపరుల ఆందోళన
- ఏసీపీ, డీసీపీ జోక్యంతో విరమణ


ధ్వంసమైన కిటికీ అద్దాలు


మేనేజర్‌తో మాట్లాడుతున్న దీక్షాపరులు, తల్లిదండ్రులు

దండేపల్లి: హనుమాన్ దీక్ష తీసుకున్న ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ పరీక్షకు అనుమతించకపోవడం ఆందోళనకు దారితీసింది. వివరాలు.. మండలంలోని కన్నెపల్లి సమీపంలోగల మదర్‌థెరిస్సా ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న దీవెన్, విద్యాదిత్య, హర్షవర్ధన్ హనుమాన్‌దీక్ష తీసుకున్నారు. కాగా, దీక్ష దుస్తులతో పాఠశాలకు వస్తే పరీక్షకు అనుమతించమని ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ విషయాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాలకు చెందిన పలువురు హనుమాన్ దీక్షాపరులు మంగళవారం పాఠశాలకు చేరుకున్నారు. ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ సమీప జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం పాఠశాల ప్రధాన గేటు ఎదుట ఆందోళన దిగారు. పోలీసులు అడ్డుకున్నా లోనికి చొరబడ్డారు. 'జైశ్రీరాం' నినాదాలతో హోరెత్తించారు. విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని, ప్రిన్సిపాల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదంతా జరుగుతున్నా ప్రిన్సిపాల్, సిబ్బంది బయటికి రాకపోవడంతో మరింత ఆగ్రహించారు. పాఠశాల ఆవరణలోని పూల కుండీలు, కిటికీ అద్దాలు పగులగొట్టారు. మేనేజర్‌పై దాడిచేశారు. విషయం తెలుసుకున్న లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పినా వినలేదు. డీఈవో వచ్చి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో అన్యమత ప్రచార ఫొటోలు తొలగించి, సరస్వతీదేవి ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. సుమారు నాలుగు గంటలపాటు ఆందోళన కొనసాగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, డీసీపీ అశోక్, ఎంఈవో రవీందర్ అక్కడకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఆందోళన చేస్తున్న దీక్షాపరులతో మాట్లాడారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాల మేనేజర్ జైసన్ కూడా క్షమాపణ చెప్పగా ఆందోళన విరమించారు. కాగా, డిసిప్లేన్‌లో భాగంగానే యూనిఫాం వేసుకోవాలని చెప్పామని, ఇందులో దురుద్దేశం లేదని పాఠశాల మేనేజర్ జైసన్ తెలిపారు. ఇకముందు ఇలా జరగకుండా చూస్తామని చెప్పారు. ఎంఈవో రవీందర్ స్పందిస్తూ ఘటనకు సంబంధించిన సమాచారం డీఈవోకు తెలిపినట్లు చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్ మాట్లాడుతూ.. పాఠశాలలో జరిగిన ఘటనపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న బియ్యం, వ్యాన్

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని తైబానగర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. తైబానగర్‌లోని పోస్టాఫీస్ పక్కన పీడీఎస్ బియ్యాన్ని డీసీఎం, ఆటోలో నింపి మహారాష్ట్రకు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో దాడిచేసినట్లు పేర్కొన్నారు. కుక్క రాజేశ్, రాజిక్ రెహమాన్ నుంచి 18 క్వింటాళ్లు, అఫ్రోజ్ పాషా, అంకూష్‌బీ నుంచి నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సైలు మహేందర్, అంజయ్య తదితరులున్నారు.

శుభలేఖలు పంచేందుకు వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరొకరికి గాయాలు

జగిత్యాల క్రైం: బంధువులకు శుభలేఖలు పంచేందుకు వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని బోయవాడకు చెందిన బోరె మహేశ్(21) తన మిత్రుడు జిన్న శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం శుభలేఖలు పంచేందుకు మల్యాల మండలం లంబాడిపల్లికి బైక్‌పై వచ్చాడు. సాయంత్రం తిరిగి లక్సెట్టిపేట వెళ్తుండగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై వెనక నుంచి వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న మహేశ్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాంత్ గాయపడగా స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.


తగ్గిన మామిడి కాత

- వాతావరణ మార్పులే కారణం
- ఆందోళనలో మామిడి రైతులు


సంకారం సమీపంలో కాతలేని మామిడి చెట్లు

చెన్నూర్‌రూరల్: మామిడి రైతులు ఏటా ఏదోలా నష్టపోతున్నారు. ప్రస్తుతం కొన్నిచోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలిపోతున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 18వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. నెన్నెల, భీమారం, బెల్లంపల్లి, జన్నారం, దండేపల్లి, చెన్నూర్, కోటపల్లి మండలాల్లో తోటలు ఎక్కువగా ఉన్నాయి. మామిడి చెట్లకు ఫిబ్రవరిలో పూర్తిస్థాయిలో పిందెలు పడతాయి. మొదట్లో ఎక్కువ మొత్తంలో పూత వచ్చింది. కానీ, ఈసారి వాతావరణ మార్పులతో పూత బాగా రాలిపోయింది. కొంతవరకు మాత్రమే కాయలు కాశాయి. మే వరకు కాయలు ఎదిగి రైతులకు దగుబడి వస్తుంది. కానీ, వాతావరణ పరిస్థితుల కారణంగా కాత సరిగా లేదు. రూ.వేలకు వేలు వెచ్చించి మందులు పిచికారి చేసినా కాత సరిగా లేక రైతులు దిగులు చెందుతున్నారు. ఏటా ఈదురుగాలులు, అకాల వర్షాలతో కాయలు రాలిపోతూ కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. అంతే కాకుండా పిందె, కాయ దశకు చేరుకునే సమయానికి వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రభావం చూపుతున్నాయి. ఈసారి కాత సరిగా లేక తోటలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.


పూత బాగా వచ్చినా..



ఈ ఏడాది మొదట్లో మామిడి చెట్లకు పూత బాగానే వచ్చింది. కానీ, పూత వచ్చిన సమయంలో మబ్బులు పట్టడంతో బాగా రాలిపోయింది. కాత తక్కువగా వచ్చింది. ఏటా నష్టపోతూనే ఉన్నాం.

– అర్జయ్య, సంకారం

దిగుబడి తగ్గుతుంది



ఏటా ఏదో కారణంగా నష్టపోతూనే ఉన్నాం. వాతావరణ మార్పులతో ఈ సారి కాత సరిగా లేదు. గతేడాది కూడా ఇలాగే నష్టపోయినం. ఏటా మాకు నష్టాలే మిగులుతున్నాయి.

– తిరుపతి, బుద్దారం

కార్మికులందరికీ ఇన్సెంటివ్ చెల్లించాలి


మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ గని కార్మికులందరికీ ఇన్సెంటివ్ చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే.బాజీసైదా అన్నారు. ఓపెన్ కాస్ట్ గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మేనేజర్ బ్రహ్మాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ గనిలో ఓసీపీ, సీహెచ్‌పీ రెండూ కలిసి ఒకేచోట ఉండడం వల్ల కార్మికులకు ఇన్సెంటివ్ రావడం లేదని, వీటిని రెండు భాగాలుగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, నాయకులు గునిగంటి నర్సింగ్, అఫ్రోజ్‌ఖాన్, రాజయ్య, నాగేశ్వర్‌రావు, సత్తయ్య పాల్గొన్నారు.



BUYERS BEWARE
CAUTION NOTICE

The Public, in general, are hereby informed that, my client Sri. Gadapa Narender filed a Writ Petition vide W.P. No. 3109 of 2024 in the Hon'ble High Court, Hyderabad challenging the building permission vide Permit No. 0009/BP/3026/2001 dated 21.12.2021 granted in favour of Sri. Gadapa Rajesh and Gadapa Satya Krishna for construction of one stilt+5 upper floors in Sy.No. 92, Ward No. 30 in Sai Ram Nagar, Mancherial Town and Municipality, as the said building permission is obtained by playing fraud on the Municipal Authorities. Originally Late Sri. Gadapa Srihari, was allotted the plot to an extent of 146 sq. yds in family partition, however, his legal heirs i.e., Gadapa Radha, Gadapa Usha Rajan and Gadapa Satya Krishna by illegally claiming the public road to an extent of 57 sq. yds to be theirs, had registered the document for an extent of 203 sq. yds along with Sri. Gadapa Krishna vide doc. No. 11839 of 2021 dated 07.09.2021. Accordingly, multi storied residential building is being constructed by occupying the public road and by suppressing the above important legal matters, Sri. Gadapa Rajesh and Gadapa Satya Krishna are offering to sell the residential flats to the prospective buyers by entering into sale agreements collecting huge amounts offering them to register the property at an earliest date. The prospective buyers through this caution notice are alerted and warned not to buy any residential flats/commercial space of the above mentioned property, they would be doing it at their own risk for which my clients will not be responsible.

P.V.L. BHANU PRAKASH / G. SRAVANI
ADVOCATES
Flat No. 105, Ameer Estates Apartment, Besides ICICI Bank, S.R.Nagar, Ameerpet, Hyderabad. (c) 9949155591
Email: bhanuadvocate@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 89208 66865. [T-1252729]

WANTED

■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K Ph:9160900024/ 9640400073 [H-799868]

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185038]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462